30నే పింఛన్ల పంపిణీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 30వ తేదీనే పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. డిసెంబరు 1 ఆదివారం రావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారులు ఎవరైనా అందుబాటులో లేకుంటే డిసెంబరు 2న అందజేయాలని కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. పింఛను పంపిణీదారులు తమకు సంబంధించిన సచివాలయాల పరిధిలో నవంబరు 30న ఉదయం 6గంటలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల పింఛను అరియర్స్ పొందే సౌకర్యాన్ని, పింఛన్‌దారుడు మరణిస్తే ఆయన భార్యకు మరుసటి నెల నుంచి పింఛను మంజూరు చేస్తామనే విషయాలను పింఛను లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు.

డ్వామా పీడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్వామా పీడీగా ఆదిశేషారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు డీఎఓవోగా ఉన్న ఈయనను ప్రభుత్వం కడప డ్వామా పీడీగా నియమించిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. డ్వామా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లలను అనవసరంగా బయటకు పంపకండి

● ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఉదయం పాఠశాలలు, కాలేజీలకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చిన తరువాత అనవసరంగా బయట తిరగనీయకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, సంరక్షకులదే అని ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసుల నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించినా, ఆడపిల్లల పట్ల అనుచితంగా నడచుకున్నా టీసీ ఇచ్చేస్తామని, మరి ఏ ఇతర స్కూళ్లల్లో కానీ కాలేజీల్లో కానీ జాయిన్ చేసుకోని విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతటివారైనా అందరికీ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎటువంటి వారితో స్నేహం చేస్తున్నారో, ఎక్కడ తిరుగుతున్నారో దుర్వ్యసనాలకు పాల్పడుతున్నారా అనే విషయాలను ఓ కంట కనిపెడుతూ ఉండాలని సూచించారు. పిల్లలకు ఫోన్లు కానీ, పర్సనల్ కంప్యూటర్లు కానీ ఇవ్వరాదని తెలిపారు. పిల్లలను గారాబంగా పెంచి వారిని మత్తుకు అలవాటుపడేలా చేయరాదని.. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొక్కై వంగనిది మానై వంగునా అనే నానుడి ప్రకారం తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణగా పెంచితేనే తద్వారా దేశం బాగుపడుతుందని సూచించారు.

ఎస్పీ గ్రీవెన్‌సెల్‌కు 97 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లా నలుమూలల నుంచి 97 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు ఎస్పీ ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీసుస్టేషన్లకు బదిలీ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదు వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైల్వేజోన్ ఏర్పాటు హర్షణీయం : తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల ఆలస్యంగా.. ఇప్పటికైనా రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించడం హర్షణీయమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో విశాఖ కేంద్రంగా నూతన దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే రైల్వేజోన్ ఎప్పుడో వచ్చి ఉండేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసకారితనం, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల చేతగానితనంతో ఇప్పటి వరకు రాలేదన్నారు. విభజనచట్టంలోని మిగిలిన అంశాలను అమలుచేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలలోనైనా ప్రత్యేక హోదా, కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ, రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు.

ఫోర్జరీ చలానాలపై కమిషనర్ ఫిర్యాదు

ప్రొద్దుటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సర్వే సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారి నుంచి ఫోర్జరీ చలానాల ద్వారా డబ్బులు తీసుకుని ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టిన సర్వేయర్ కృష్ణకిశోర్‌పై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కమిషనర్ వన్‌టౌన్ పోలీసు స్టేషనుకు వెళ్లి సీఐ రామకృష్ణారెడ్డికి ఫిర్యాదును అందజేశారు. ఫోర్జరీ చలానాలపై విచారణ చేపట్టి సర్వేయర్‌తో పాటు ఇంకా ఎవరెవరు ఇందులో ఉన్నారు, మున్సిపల్ ఆదాయానికి ఎంత నష్టం వాటిల్లిందో తేల్చాలని కోరారు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ సభ్య కమిషన్ వేసి నివేదికను సిద్ధంచేశారు. ఫోర్జరీ చలానాలు, ఫోర్జరీ సర్టిఫికెట్లు కూడా తేలాయని అందులో రిపోర్టు చేశారు. దీని ఆధారంగా సర్వేయర్ కృష్ణకిశోర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.





నిత్యపూజయ్య స్వామి దర్శనం కోసం అడవిలో నడచి వెళుతున్న భక్తులు





శరణు శరణు శంకరా.. కరుణ జూపురా..

● కొండ కోనల్లో.. శివ నామస్మరణ

కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో జిల్లాలోని శివాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. ముఖ్యంగా కొండకోనల్లోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. సిద్దవటం మండలం నిత్యపూజకోనలోని నిత్యపూజయ్యస్వామి దర్శనంకోసం భక్తులు భారీగా తరలివచ్చారు. పిల్లల నుంచి ముసలి వాళ్ల వరకు రాళ్లలో నడిచి వ్యయప్రయాసలకోర్చి మెట్లెక్కి అక్కడి జలపాతంలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. కార్తీక దీపాల వెలుగులో ఆలయాలన్నీ దేదీప్యమానంగా ప్రకాశించాయి. కడప నగరంలోని మృత్యుంజయేశ్వరస్వామి, పాలతల మల్లికార్జునస్వామి ఆలయం, ఖాజీపేట నాగనాథేశ్వరుడు, ప్రొద్దుటూరు, బ్రహ్మంగారి మఠం మండలాల్లోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులకు పలువురు అన్నదానం చేశారు.

- కడప కల్చరల్



ప్రత్యేక అలంకరణలో నిత్యపూజస్వామి



మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో



కడప మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయేశ్వరుడు



ప్రొద్దుటూరు రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు





ప్రొద్దుటూరు రామేశ్వరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అవినీతికి కేరాఫ్..!

● రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు నిర్ణయించి పైసా వసూల్
● ఇదీ.. బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దుస్థితి

7

పంటల బీమాపై అవగాహన పెంచాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటల బీమాపై రైతుల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. సోమవారం పంటల బీమాపై ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజనుకు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమాపై రైతుల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే రైతుకు నష్టపరిహారం అందజేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ మీటింగ్‌లో చర్చించారు.

జీవనోపాధుల కల్పనే లక్ష్యం

● సాంప్రదాయక ఆహార ఉత్పత్తులకు ఊతం
● జిల్లా పేరుతో ఆహార పదార్థాలకు బ్రాండింగ్
● వినూత్న ప్రయత్నం
● అధికారులకు కలెక్టర్ ఆదేశం

6



బిస్కట్లు తయారు చేస్తున్న సుభద్ర

భారీ తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ విజయం

● 79 పరుగుల తేడాతో ప్రకాశం.. 4 వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి విజయం

7

బాబోయ్.. బడి ఆటోలు..!

● పిల్లల ప్రాణాలతో ఆటలు ● పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణం
● ఒక్కోదాంట్లో పదిమందికి పైగానే ● కనీస జాగ్రత్తలు కరువు
● ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం ● అందుబాటులో లేని ఆర్టీసీ సేవలు



విద్యార్థినులను కుక్కినట్టు ఎక్కించుకుని వెళుతున్న ఆటో

పులివెందుల టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటుపాఠశాలల నిర్వాహకులు, ఆటో డ్రైవర్లు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆటోల్లో పరిమితికి మించి చిన్నారులను తరలిస్తున్నారు. రవాణాశాఖ నిబంధనలను బేఖాతరు చేసి చిన్న ఆటోల్లో సైతం పదిమందిని ఎక్కిస్తున్నారు. వెనక సీటులో ముగ్గురు, డ్రైవరు వెనక చెక్కపైన ముగ్గురు, సైడు రాడ్డుపైన ఒకరు, డ్రైవరు ఇరువైపులా ఇద్దరు విద్యార్థులను కూర్చోబెట్టుకుని వెళుతున్నారు. ఇది ప్రమాదంగా మారింది. ఆటోల ఫిట్‌నెస్ ఎలా ఉందన్న విషయం అటు పాఠశాలల యాజమాన్యాలు, ఇటు పిల్లల తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు.

నిబంధనలు బేఖాతరు

ఆటోల్లో ఒక డ్రైవరు, ముగ్గురు ప్రయాణికులకు మాత్రమే అనుమతి ఉంది. టాటా మ్యాజిక్ ఆటోల్లో డ్రైవరుతో పాటు ఆరుగురు ప్రయాణించవచ్చు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. చిన్న ఆటోల్లో సుమారు 10 మందిని, మ్యాజిక్ ఆటోల్లో 20 మందిని తరలిస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రహదారి భద్రత పేరిట ప్రభుత్వ వారోత్సవాలు నిర్వహిస్తున్నా.. సౌకర్యాల లేమితో ప్రజలు ప్రమాదపుటంచున ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

బస్సు సౌకర్యం లేక..

పులివెందుల మండల పరిధిలో ఎర్రిపల్లె, అచ్చెవెల్లి, చిన్నరంగాపురం, పెద్దరంగాపురం, కనంపల్లె గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. కొన్ని గ్రామాలకు రోడ్లు బాగున్నా బస్సులు రావడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నా, ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక ప్రజలు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. 20రోజుల కిందట కనంపల్లె నుంచి వస్తున్న ఆటో బోల్తా పడి పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు. అలాగే పరిమితికి మించి విద్యార్థులను తరలించే ఆటోలపై పోలీసుశాఖ దృష్టి సారించాల్సి ఉంది.

అనేక ప్రైవేటు స్కూళ్లకు ఆటోలే..

పులివెందుల పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అనేక ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులను చేరవేసేందుకు ఆటోలే ఉన్నాయి. కొన్నింటికీ బస్సులతో పాటు ఆటోలు కూడా ఏర్పాటు చేశారు. దీనికి తోడు కొందరు తల్లిదండ్రులు ఆటో డ్రైవర్లతో నెలబాడుగ మాట్లాడుకుని పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్నారు. అయితే ఎక్కువ ఆటోల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కిస్తు ఆటోలను చూస్తే వణుకు పుడుతుంది. వీటిపై రవాణాశాఖ అధికారులు పెద్దగా దృష్టి సారించడంలేదు. పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్‌ను ఏటా పరీక్షిస్తున్నా ఆటోలను పట్టించుకోకపోవడం మాత్రం విమర్శలకు తావిస్తోంది.

కేసులు నమోదు చేస్తాం..



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం. తనిఖీలు ముమ్మరం చేసి పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తాం. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తాం.

- జీవీ ప్రసాద్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు, పులివెందుల



ప్రమాదకర ఆటో ప్రయాణం చేస్తున్న యువకులు

రాజ్యాంగం పవిత్ర గ్రంథం : డీఈవో

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథమని, ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పనిచేయడానికి బలమైన పునాది అని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. సోమవారం సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాజ్యాంగంపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డిబేట్, దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో విజేతలకు డీసీసీబీ హాలులో సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు ఈ నెల 26న జరిగే రాయలసీమ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి డీఈవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎంఈవో గంగిరెడ్డి, జిల్లా మాజీ సైన్స్ అధికారులు రెహ్మాన్, నిత్యానందరెడ్డి, జిల్లా సైన్స్ సమన్వయకర్త డీవీ సుబ్బనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో డీఈవో మీనాక్షి తదితరులు

జీవనోపాధుల కల్పనే లక్ష్యం



- సాంప్రదాయక ఆహార ఉత్పత్తులకు ఊతం
- జిల్లా పేరుతో ఆహార పదార్థాలకు బ్రాండింగ్
- వినూత్న ప్రయత్నం
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా మెరుగైన జీవనోపాధులు కల్పించి మహిళల్లో ఆర్థిక సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నేతృత్వంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో స్థానికంగా పేరొందిన సాంప్రదాయ ఆహార ఉత్పత్తులకు ఊతమిచ్చే విధంగా బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈ మేరకు ఏపీ స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, డీఆర్‌డీఏ, మెప్మా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ అధికారులతో సాంప్రదాయ ఆహార ఉత్పత్తులపై ఇప్పటికే సమావేశమై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణపై ఆరా తీశారు. అధికార యంత్రాంగం ఆలోచన మేరకు వీరి ప్రయత్నం సఫలీకృతమైతే జిల్లాలో స్థానికంగా లభ్యమయ్యే సాంప్రదాయక ఆహార ఉత్పత్తుల తయారీదారులతో పాటు రైతులకు సైతం ఆదాయం చేకూరే అవకాశం లేకపోలేదు. జిల్లాలో ప్రాధాన్యత ఉన్న స్వీట్స్, కారాలు , మిల్లెట్, ఊరగాయలు, పొడర్లు, స్పైసెస్ వంటి ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ తీసుకువచ్చేందుకు కోర్ టీం అధికారులు ప్రయత్నం మొదలుపెట్టారు.

మహిళా సంఘాలకు ప్రయోజనం

పొదుపుతో మొదలైన మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం వివిధ రుణాలు మంజూరు చేస్తూ జీవనోపాదుల కల్పన చేపట్టింది. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటికే ఆహార ఉత్పత్తి కూడా కొనసాగుతోంది. అయితే సరైన మార్కెటింగ్ లేకపోవడంతో ఆశించినంత స్థాయిలో లాభాలు గడించలేక పోతున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక మార్పులు తీసుకువచ్చి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆహార ఉత్పత్తిదారుల తయారీలను బయట ప్రపంచానికి తెలిసేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సభ్యులు తయారు చేసే కడప అరెశలు, పోరుమామిళ్ల ఊరగాయలు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు పసుపు, రాజుపాలెం, జమ్మలమడుగు మండలాల్లో తయారు చేసే పాలకోవా, ప్రొద్దుటూరులో తయారవుతున్న తంగేడుపల్లె స్వీట్, పులివెందుల, వేముల మిల్లెట్స్ వంటి ఆహార పదార్థాల ప్రమాణాలు, నాణ్యతలను ముందుగా అధికారులు పరిశీలించి ఎలా తయారు చేస్తున్నారు. ఎలా ప్రాసెసింగ్ చేస్తున్నారు, ప్యాకింగ్ ఏ విధంగా చేస్తున్నారు వంటి అంశాలను అధ్యయనం చేయనున్నారు. ప్రధానంగా జిల్లా పేరు గుర్తుకు రాగానే ఇవి కడప జిల్లాకు చెందిన ఆహార ఉత్పత్తులుగా గుర్తించడానికి ప్యాకింగ్, క్వాలిటీ, బ్రాండింగ్ రిజిస్ట్రేషన్ అన్నీ పక్కాగా ఉండాలనే విధంగా తగు చర్యలు తీసుకోనున్నారు.

కార్పొరేట్ ఉత్పత్తుల తరహాలో మార్కెటింగ్



కార్పొరేట్ రంగ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తరహాలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయాలు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పొదుపు సంఘాల్లోని మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం, మరింత మెరుగైన జీవనోపాదుల కల్పన కోసం అనేక పథకాలు అమలయ్యే పరిస్థితి ఉంది.

- వై.సురేశ్‌రెడ్డి. మెప్మా పీడీ

జిల్లా ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు

సాంప్రదాయక చరిత్ర కలిగిన జిల్లా వంటకాలకు, ప్రాచుర్యం ఉన్న మాధవరం చీరలు వంటి వాటికి దశల వారీగా భౌగోళిక గుర్తింపు తీసుకురావాలనే ప్రయత్నంలో అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఆహార ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్, మార్కెటింగ్ చేసి వాటి తయారీపై ఆధారపడిన వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. సాంప్రదాయక ఆహార ఉత్పత్తులు నాణ్యత ఉన్నప్పటికీ ప్రోత్సాహం లేకపోవడంతో తగిన గుర్తింపు నోచుకోలేకపోతున్నాయి. ఈ క్రమంలో సాంప్రదాయ ఆహార ఉత్పత్తులకు మంచి బ్రాండింగ్, పేరు తీసుకువచ్చే దిశగా కార్యాచరణ సిద్ధం అవుతోంది. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) కింద ఆహార ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో చేపడుతున్న తయారీల్లో మరింత నాణ్యత తీసుకువచ్చేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా అవసరమైన తోడ్పాటు, వృత్తి నైపుణ్యంతో కూడిన నూతన సాంకేతిక పద్ధతులపై సెల్ఫ్ హెల్ప్‌గ్రూపు సంఘాలకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ప్యాకింగ్, డిజైనింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్‌తో పాటు రవాణా నిల్వ ఖర్చులు, అడ్వర్టైజ్‌మెంట్ లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించనున్నారు.



చెగోడీలు తయారు చేస్తున్న లీలావతి



బిస్కట్లు తయారు చేస్తున్న సుభద్ర



పాలకోవా తయారీలో వెంకటసుబ్బమ్మ

ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను వందశాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యలను పట్టుకుని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యలను సావధానంగా వినాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేస్తాం : ఎస్పీ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

రాయచోటిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకుని వాటిని చట్టపరిధిలో విచారించి న్యాయం చేయడానికి జిల్లా పోలీసు శాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

వికలాంగులు, వృద్ధులు, మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. అంతేగాక సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది సహాయం చేశారు. సమస్య తీవ్రత ఎలా ఉన్నా చట్ట పరిధిలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపల పరిష్కారం అందించడానికి కృషి చేస్తామని ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు.

రూ.6.50 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం

- పూర్వ విద్యార్థి ఔదార్యం



శ్రీనివాసులునాయుడు, ఆయన తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పీలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలం తిమ్మాపురం పంచాయతీ చిన్నకమ్మపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి శ్రీనివాసులునాయుడు రూ.6.50 లక్షలు వెచ్చించి విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు అనువైన డైనింగ్ హాల్‌ను నిర్మించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ఈ ఉన్నత పాఠశాలలో చదివిన గాలివారిపల్లెకు చెందిన శ్రీనివాసులునాయుడు అమెరికాలోని డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడ్డారు. రెండు నెలల క్రితం తాను విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించాడు.

పాఠశాలలోని అపరిశుభ్రంగా ఉన్న పలుచోట్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడాన్ని గమనించి తానే స్వయంగా విద్యార్థులకు ఒక డైనింగ్ హాల్ నిర్మించి ఇవ్వాలని నిర్ణయించుకుని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో చర్చించాడు. అనంతరం విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని నిర్మాణాన్ని ప్రారంభించి స్వల్ప కాలంలోనే పూర్తి చేశాడు. సోమవారం ఈ డైనింగ్ హాల్‌ను తల్లిదండ్రులు రెడ్డెమ్మ, గాలి గోవిందునాయుడు, పెదనాన్న గంగయ్యల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని అమెరికాలో ఉన్నత స్థానంలో స్థిరపడ్డానని చెప్పారు. చెన్నైలోని 'సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్' అనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా క్యాన్సర్ బాధితులుగా ఉన్న 120 మంది పిల్లలకు కావలసిన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

చెన్నైలోనే ఒక వృద్ధాశ్రమంలో వున్న 60 మంది వయో వృద్ధుల బాగోగులు చూసుకుంటున్నట్లు చెప్పారు. ఇవన్నీ సంస్కారవంతమైన విద్య ద్వారానే అలవడినట్లు స్పష్టం చేశారు. చదువుకోవలసిన సమయంలో చదువును అభ్యసిస్తేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. శ్రీనివాసులునాయుడును హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర నెట్‌బాల్ విజేత విశాఖపట్నం



విశాఖపట్నం బాలికలకు ట్రోఫీ అందచేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అండర్-17 రాష్ట్ర స్కూల్స్ గేమ్స్ నెట్‌బాల్ బాలికల జట్టు విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. సీటీఎం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలు సోమవారంతో ముగిశాయని అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. కాగా పోటీల్లో ద్వితీయస్థానంలో పశ్చిమగోదావరి, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లా జట్లు నిలిచాయన్నారు. విజేతలైన జట్లకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ప్రతి ఒక్కరూ విజేతలే అన్నారు. మదనపల్లె క్రీడాకారులకు పుట్టినిల్లు అని, వాతావరణం కూడా క్రీడాకారులకు అనుకూలించిందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలు డిసెంబరులో పంజాబ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు : హిందూజా, వెంకటరేష్మా (పశ్చిమ గోదావరి), జాగారపు ప్రణతి, రిషిత (విశాఖపట్నం), సుప్రియ (కృష్ణా), సాత్విక (కడప), హన్సిక (అనంతపురం), కళ్యాణిరేవతి (తూర్పుగోదావరి), బీష్మా, వర్షి (చిత్తూరు), భానుప్రియ (గుంటూరు).

స్టాండ్ బైలుగా : చంద్రకళ (చిత్తూరు), శిరీషా (విశాఖపట్నం), పోషిత (పశ్చిమగోదావరి), పూజిత (కృష్ణా), సింధూరి (కడప) ఎంపికయ్యారని అబ్జర్వర్ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగరాజు, నరేష్‌బాబు, పూర్ణిమ, గ్రామ కమిటీ వేమన్న, పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కారు ఢీకొని ఒకరికి గాయాలు

నందలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వేకోడూరు తహసీల్దారు మహబూబ్‌చాంద్ సోమవారం ఉదయం కడప నుంచి కోడూరుకు వెళుతుండగా ఆమె ప్రయాణిస్తున్న కారు స్థానిక కన్యకాచెరువుకట్ట వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న చెన్నయ్యగారిపల్లెకు చెందిన నరసింహులును ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల ముంగిటకే రక్షణ వ్యవస్థ

జిల్లాలో తొలి జీఆర్‌సీ ప్రారంభం : ఎమ్మెల్యే : షాజహాన్‌బాషా



జీఆర్‌సీని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గృహహింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు తదితర సామాజిక సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ముంగిటకే రక్షణ వ్యవస్థ తీసుకొచ్చాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెండర్ రీసోర్సు సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వర్చువల్‌గా ఈ సెంటర్లను ప్రారంభించిందన్నారు. మన రాష్ట్రంలో కేవలం 12 సెంటర్లు మాత్రమే మంజూరు కాగా అందులో మదనపల్లెలో జీఆర్‌సీ సెంటర్‌ను మోడల్ సెంటర్‌గా ఏర్పాటు చేయడం ఇక్కడి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సామాజిక సమస్యలపై మహిళలు ఇకపై పోలీసుస్టేషన్ వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు జీఆర్‌సీలో అధికారులు ఉంటారని, మహిళల సామాజిక సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. టీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో, ఏపీఎం, సీడీపీవోతో పాటు మహిళా సమాఖ్య లీడర్లు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు ఇక్కడ ఉంటారన్నారు. జీఆర్‌సీలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా సంఘమిత్రలు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్రమణ్యం, ఖిజర్ అహ్మద్, ఎంఎస్ లీడర్లు సావిత్రి, సునీత, మల్లీశ్వరి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా దాచి ఉంచిన 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సబ్‌కంట్రోల్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన సోమవారం ఒక ప్రెస్‌నోట్ విడుదల చేశారు. రాజంపేట సెక్షన్‌లోని పించా డ్యాం వద్ద ఆర్‌ఎస్ఐపీ రాఘవేంద్ర సిబ్బందితో కలసి కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆరోగ్యపురం సమీపంలో చెయ్యేరు వద్ద కొందరు వ్యక్తులు కనిపించగా పోలీసులను చూసి వారు పారిపోతుండగా ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతను అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, అతడు ఇచ్చిన సమాచారం మేరకు సమీపంలో దాచి ఉంచిన 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించగా ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జలపాతం.. సందడే.. సందడి...

మండలంలోని మాధవరం పోడుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంజన జలపాతం వద్ద సోమవారం సందర్శకులతో సందడిగా మారింది. కార్తీక సోమవారం సందర్భంగా సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడికి చేరుకుని అక్కడే వన భోజనాలు చేశారు. జలపాతం వద్ద ఈత కొడుతూ ఉల్లాసంగా గడిపారు.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)



నీటిలో సరదాగా...



గుంజన జలపాతం వద్ద కార్తీక వన భోజనానికి వంటలు తయారు చేస్తున్న దృశ్యం



గుంజన జలపాతం

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు రావాలి : సంజయ్ దోబ్లే



మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ దోబ్లే

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగకరమైన పరిశోధనలు రావాలని ఆ దిశగా పరిశోధకులు కృషి చేయాలని నాగ్‌పూర్ యూనివర్శిటీ భౌతిక శాస్త్ర ప్రొఫెసరు డాక్టర్ సంజయ్ దోబ్లే తెలిపారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతికశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సింథసిస్ ఆఫ్ అడ్వాన్స్ మెటీరియల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ దోబ్లే మాట్లాడుతూ పరిశోధన ఫలాలను అవసరమైన మేరకు ఉపయోగించుకోవాలని, అతిగా ఉపయోగించుకుంటే అనర్థాలు ఉత్పన్నమవుతాయన్నారు. వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సైన్స్‌అండ్ టెక్నాలజీ కోసం అడ్వాన్స్ మెటీరియల్ సంశ్లేషణపై జాతీయకాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తూ ఇంజనీరింగ్, పర్యావరణ స్థిరత్వంలో మార్గదర్శక పరిష్కారాల వరకు ఇది మెరుగైందని, మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం ఆకాంక్షించాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాధ్, సదస్సు కన్వీనరు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసరు చంద్రఓబులరెడ్డి, బయపురెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రాజు, డాక్టర్ భూషణ్ రెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు స్కూటర్లు ఢీ - ఒకరి పరిస్థితి విషమం



గుర్తుతెలియని వ్యక్తి

జమ్మలమడుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్పగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా.. ప్రొద్దుటూరు నుంచి ఏపీ21బీడీ8612 నంబరుగల ద్విచక్ర వాహనంలో గుర్తు తెలియని వ్యక్తి జమ్మలమడుగు వైపునకు వస్తున్నాడు. కాగా జమ్మలమడుగు పట్టణం కుండావారి వీధికి చెందిన రామాంజనేయులు ఎక్స్‌ఎల్ వాహనంలో ఎదురుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎక్సెల్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక క్యాంబెల్ ఆస్పత్రికి తరలించారు. ఈయన వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కాగా రామాంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

7 ట్రాక్టర్లు, ఎక్సకవేటర్ సీజ్



తహసీల్దారు కార్యాలయంలో సీజ్‌చేసిన ట్రాక్టర్లు, ఎక్సకవేటర్

బద్వేలుటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బయనపల్లె చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 7 ట్రాక్టర్లను, ఒక ఎక్సవేటర్‌ను తహసీల్దార్ ఉదయభాస్కరరాజు సీజ్ చేశారు. గత కొద్ది రోజులుగా మట్టిమాఫియా రెచ్చిపోయి చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం తహసీల్దార్ తన సిబ్బందితో బయనపల్లె చెరువును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించే సమయంలో ఒక ఎక్సవేటర్‌ను, 7 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బస్సులో నుంచి దూకి యువతికి తీవ్రగాయాలు



గాయాలపాలైన శ్రీలత

చక్రాయపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రన్నింగ్ బస్సులో నుంచి దూకి యువతికి తీవ్రగాయాలైన సంఘటన చక్రాయపేటలో చోటు చేసుకుంది. పులివెందుల పట్టణం రోటరీపురం ప్రాంతానికి చెందిన సులోచన, ఆమె కుమార్తె శ్రీలత రాయచోటి నుంచి పులివెందులకు సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. చక్రాయపేట సమీపంలోకి రాగానే శ్రీలత బస్సులో నుంచి దూకేసింది. కుమార్తె దూకడంతో వెంటనే తల్లి సులోచన కూడా దూకింది. ఈ ఘటనలో శ్రీలతకు తీవ్రగాయాలై ముక్కు, చెవులు, నోటి నుంచి రక్తస్రావమై స్పృహ కోల్పోయింది. హుటాహుటిన వేంపల్లెకు తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. తల్లీ, కుమార్తెలు ఇరువురు బస్సు ఫుట్‌పాత్ డోర్‌కు ఎదురుగా ఉన్న సీటులో కూర్చున్నారు. ఉన్నపలంగా దూకడంతో ప్రయాణికులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వారసత్వ సంపదకు నిలయం కడప జిల్లా



నృత్యం చేసిన చిన్నారులతో ఇంటాక్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా భారతదేశ స్థాయిలో ఘనమైన వారసత్వ సంపదకు నిలయంగా ఉందని ఇంటాక్ సభ్యులు మంజులారెడ్డి, సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో వారసత్వ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నృత్యం చిత్రకళ, యోగా చేనేతలు తదితర అంశాలతో పాటు వారసత్వ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటాక్ కన్వీనరు లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ కేవలం శాస్త్రీయ జానపద నృత్యాలతో కార్యక్రమాన్ని ప్రసంగాలు లేకుండా ఏర్పాటు చేయడం విశేషమన్నారు. భరతనాట్యం, కూచిపూడి, అన్నమయ్య కీర్తనలు, కోలాటం, కర్రసాము, జానపద నృత్యాలు తదితర సాంప్రదాయ నృత్యాలు కళారూపాల ప్రదర్శనతో వారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. నృత్యం చేసిన చిన్నారులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య కొండూరు జనార్థన రాజు, కొండారెడ్డి, గంగాధర్, గౌరీశంకర్, నాగవేణి తదితరులు బహుమతులు అందజేశారు.

అవినీతికి కేరాఫ్..!



- రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు నిర్ణయించి పైసా వసూల్
- ప్రతి పనీ రైటర్ల కనుసన్నల్లోనే
- ఇదీ.. బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దుస్థితి

బద్వేలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తీసుకువచ్చే శాఖలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రధానమైనది. ఈ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. కొంతమంది అధికారులు తాము ఇంతే.. తమ తీరు ఇంతే అన్నకోవలో సాగుతున్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఒక రేటు నిర్ణయించి పైసా వసూలు చేస్తున్నారు. ఇక్కడ డాక్యుమెంటు రైటర్లు చెప్పిందే వేదమన్నట్లుగా అవినీతి దందా సాగుతోంది. డాక్యుమెంటు రైటర్లతో అధికారులు ఒప్పందం కుదుర్చుకుని స్థిర, చరాస్తులు రిజిష్టర్ చేయించుకునేందుకు వచ్చేవారిని జలగల్లా పీక్కుతింటున్నారు. ఈ కార్యాలయంలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పలుమార్లు ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కొంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ అధికారుల్లో ఎలాంటి మార్పురాలేదని ప్రజల్లో గుసగుసలు వినవస్తున్నాయి. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు నిర్ణయించి పైసా వసూల్‌కు పాల్పడుతున్నా ఈ అవినీతికి అడ్డుకట్ట వేయలేక పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ద్వారా లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ ముడుపులు ఇస్తేగాని, రిజిష్టర్లు చేయని దుర్మార్గపు పరిస్థితి కనిపిస్తోంది. ఈ కార్యాలయంలో డాక్యుమెంటు రైటర్లు, కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కనుసన్నల్లోనే సాగుతూ వస్తోంది. ఇక్కడ అవినీతి అధికారులకు అనేక ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. అందిన కాడికి వసూలు చేసుకోవడం ఇక్కడి అధికారుల వంతు అయిపోయిందని చెబుతున్నారు. అవినీతిలో మునిగి తేలుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పేర్కొంటున్నారు. కార్యాలయంలో లంచం ఇవ్వనిదే ఏ పని జరగడం లేదన్న ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. ఇక్కడ డాక్యుమెంటు రైటర్లదే ఇష్టారాజ్యం, వారు చెప్పిందే వేదం, వారు అడిగినంత డబ్బులు ఇస్తేనే సాఫీగా రిజిస్ట్రేషన్ జరుగుతుంది. లేకుంటే రిజిష్టర్లు ఆపేస్తున్నారన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ రైటర్లందరూ ఒక్కటిగా ఏర్పడి తమ దందాను కొనసాగిస్తున్నారు. ఏ పనికి ఎంతరేటో ముందుగానే చెప్పేస్తూ అందులో ఎవరి వాటా ఎంత అని నిర్ణయించి మరీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇది బద్వేలు నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారింది.

ఆరోపణలలో వాస్తవం లేదు

- విద్యాసాగర్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, బద్వేలు

ఆరోపణలలో వాస్తవం లేదు. ఎవరైనా లంచాలు అడిగినట్లు తమ దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఫీజు చెల్లించి రశీదు చెల్లిస్తే రిజిష్టర్ చేస్తాం. నేను ఇటీవలే వచ్చాను. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

భారీ తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ విజయం

- 79 పరుగుల తేడాతో ప్రకాశం
- 4 వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్ల విజయాలు

కడప స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం వేర్వేరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. ఈ మ్యాచ్‌లలో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 117 పరుగుల తేడాతో సెంట్రల్ జట్టుపై గెలుపొందగా, మరో మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 79 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టుపై విజయం సాధించింది. అనంతపురం జట్టుపై ఈస్ట్ గోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.

కేఓఆర్ఎం మైదానంలో

నగర కేఓఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్- రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో.. తొలుత టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 323 పరుగులు చేసింది. ఇందులో సుబ్రమణ్యం (బ్యాటర్) 129 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. కాగా మరో బ్యాటర్ ధరణికుమార్‌నాయుడు 59 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 206 పరుగులకు కుప్పకూలింది. ఇందులో స్వామినాయుడు (బ్యాటర్) సరిగ్గా 100 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో ధరణికుమార్‌నాయుడు 5 వికెట్లు సాదించారు. దీంతో 117 పరుగుల భారీ తేడాతో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు విజయం సాధించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో

నగర రిమ్స్ సమీప వై.ఎస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్- ప్రకాశం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 345 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోహిత్ (బ్యాటర్) 119 పరుగులు చేయగా మరో బ్యాట్స్‌మెన్ అభినవ్ 75 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 48.5 ఓవర్లలో 266 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో హిమకర్ (బ్యాటర్) 64 పరుగులు చేయగా మరో బ్యాటర్ రవికిరణ్ 65 పరుగులు చేశారు. దీంతో ప్రకాశం జట్టు 79 పరుగుల తేడాతో గెలుపు సాధించింది.



100 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన స్వామినాయుడు (రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్)

కేఎస్ఆర్ఎం మైదానంలో

నగర శివారు ప్రాంత కెఎస్ఆర్ఎం మైదానంలో ఈస్ట్ గోదావరి-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 268 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 47.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 271 పరుగులు మాత్రమే చేసింది. ఇందులో టి.వి.సాయిశ్రావణ్ 93 పరుగులు చేశారు. దీంతో ఈస్ట్ గోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఓబీసీ కులగణన వెంటనే చేపట్టాలి


- బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యావత్ భారతదేశంలో జనగణనతో పాటుగా ఓబీసీ కులగణన త్వరగా పాలక ప్రభుత్వాలు చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఓబీసీ కులగణన చేట్టిన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడాలని తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పాలక ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారన్నారు. ఆ మేరకు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు దృష్ట్యా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు కళ్యాసుధాకర్ మాట్లాడారు. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1931 సంవత్సరంలో మన దేశంలో గల అన్ని కులాల జనాభా వివరాలతో పాటుగా జీవన స్థితిగతులను సేకరించారన్నారు. తదుపరి ఇంతవరకూ జరిగిన ఏ జనగణనలోనూ, సమగ్ర కులగణన జరపకపోవడం విడ్డూరంగా వుందన్నారు. స్వతంత్ర భారతంలో 77 సంవత్సరాల తర్వాత కూడా అణగారిన వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన, కులాలవారిగా వివరాలను శాస్త్రీయంగా సేకరించకపోవడం బాధాకరమన్నారు. మనదేశంలో సుమారు 6,743 కులాలున్నాయని, అందులో 3,964 ఓబీసీ కులాలతో విభజితమై వున్నారు. కాగా మొత్తం జనాభాలో 52 శాతంగా వున్న ఓబీసీలకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్య, ఉద్యోగ, ఉపాధి, రంగాలలో మాత్రం వీరి వాటా 12 నుంచి 21 శాతానికి మించి లేవని పలు సర్వేలు చెబుతున్నాయన్నారు. ఆధిపత్య కుల ప్రాధాన్యత కలిగిన హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో ఓబీసీ పార్లమెంట్ సభ్యులు ఏనాడు 12 నుంచి 30 శాతానికి మించడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి త్వరితగతిన ఓబీసీ కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు సీఆర్‌ఐ సునీల్ జయంత్, నాయకులు ఖాదర్‌బాష, మహిళా నాయకురాలు జయశ్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు

వంద పుస్తకాలు బహూకరణ



బ్రౌన్ గ్రంథాలయానికి సమర్పించిన పుస్తకాలు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన విశ్రాంత జియాలజిస్ట్ జి.వెంకట్రామిరెడ్డి వంద పుస్తకాలను సోమవారం సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గ్రంథాలయ సహాయకుడు ఎన్.రమేశ్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా సంచాలకురాలు ప్రొఫెసరు పార్వతి మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో గాలిబ్ గీతాలు, సింహాచల వైభవం, మా పసలపూడి కథలు, భట్టిప్రోలు కథలు, తెలుగుకథ ఇలా అనేక గ్రంథాలున్నాయన్నారు. కాగా వెంకట్రామిరెడ్డిని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ హర్షం వ్యక్తం చేశారు.

మట్కారామయ్య అరెస్టు

- రూ.50,130 నగదు, చీటీలు స్వాధీనం

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లెలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు ఎర్రముక్కపల్లెకు చెందిన రామయ్య అలియాస్ మట్కారామయ్య మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సీఐ రామక్రిష్ణ అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.50130 నగదు, మట్కాచీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గోపవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. స్థానిక రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి అనుమతులు లేకుండా పెద్దపోలు పల్లెకుంట తనిఖీ కేంద్రం నుంచి ఇసుకను తరలిస్తుండగా టిప్పరును స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని, ఇసుక తరలింపుపై పోలీసుల నిఘా ఉందన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన ఉండాలి

కడప ఎన్జీఆర్‌సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రస్థాయిలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా కుష్ఠు, క్షయ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఎన్జీవోలు, సీబీవోలు, సభ్యులతో సమావేశం నిర్వహించారు.

గంగనపల్లె విద్యార్థుల ప్రతిభ

పెండ్లిమర్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు సావిత్రిదేవి తెలిపారు. వక్తృత్వ పోటీలలో ప్రథమస్థానంలో హజీరా నిలిచిందన్నారు. రాజ్యాంగంపై డిబేట్ నందు భవితరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.

జీఎన్ఎస్ఎస్-1 ఈఈ గా ఉమామహేశ్వర్లు



ఈఈగా బాధ్యతలు చేపడుతున్న ఉమామహేశ్వర్లు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్-1) ఈఈ(ఎఫ్ఏసీ)గా ఉమామహేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ డీఈగా ఉన్న ఆయనకు ప్రమోషన్ రావడంతో ఎస్ఈగా కడప జీఎన్ఎస్ఎస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేసిన ఈఈ శ్రీనివాసులు సీఈగా ప్రమోషన్ పొందారు. కాగా గండికోట ప్రాజెక్టుతో పాటు పలు రిజర్వాయర్లు జీఎన్ఎస్ఎస్-1 పరిధిలోకి వస్తాయి.

బొలెరో వాహనాన్ని ఢీకొన్న లారీ

- డ్రైవరుకు గాయాలు



రోడ్డుపై పడి ఉన్న కోడిగుడ్లు

పులివెందులటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం కడప రోడ్డులోని మెడికల్ కళాశాల సమీపంలో కోడిగుడ్ల బొలెరో వాహనాన్ని రేషన్ బియ్యం లారీ ఆదివారం రాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవరు ప్రసాద్ తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. కడప నుంచి పులివెందులకు కోడిగుడ్ల బొలెరో వాహనం వస్తోంది. ఈ మేరకు ఎదురుగా వచ్చిన రేషన్ బియ్యం లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం, లారీల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బొలెరో వాహనం డ్రైవరు ప్రసాద్‌కు కూడా గాయాలవడంతో చికిత్స నిమిత్తం దగ్గరలో ఉన్న వైఎస్ఆర్ సర్వజన ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

పెండ్లిమర్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌యూనిట్ అధికారి నాగలక్ష్మిరెడ్డి సూచించారు. సోమవారం చౌటపల్లె గ్రామంలో జ్వరాలపై సర్వే నిర్వహించి ప్రజలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నీటికుంటలను పరిశీలించి దోమల నివారణ మందును పిచికారీ చేశారు. జ్వర లక్షణాలు ఉన్న వారికి చికిత్స అందించారు. సూపర్‌వైజర్ రవీంద్రనాథ్, సీహెచ్‌ఓ సరోజిని, ఏఎన్ఎం సంధ్య, హెల్త్ అసిస్టెంట్ సుబ్బరామయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలి: కమిషనర్


మాట్లాడుతున్న మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కార మార్గం చూపాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు 34 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి 10, టౌన్‌ప్లానింగ్ 7, రెవెన్యూ 8, హెల్త్ 3, ఎస్టాబ్లిష్‌మెంటు ఒక అర్జీ వచ్చిందన్నారు. అలాగే సచివాలయం 2, యూసీడీ 3 వచ్చాయని, వీటన్నింటినీ పరిశీలించి అధికారులకు పంపినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అడిషనల్ కమిషనర్ రాకేశ్ చంద్రం, ఈఈ నారాయణ స్వామి, ధనలక్ష్మి, ఏసీపీ మునిరత్నం, ఎంహెచ్ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు, సాగుభూముల కోసం ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రమణ్యం

కడప నాగరాజుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లస్థలాలు, సాగుభూముల కోసం ఉద్యమం చేపడతామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా పేదలకు ఇంటిస్థలం మంజూరు చేయాలన్నారు. పేదలకు న్యాయం చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు.

'మా భూములను సోమశిలకు సేకరించండి'

కడప (ఎన్టీఆర్ సర్కిల్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :తమ గ్రామ భూములను సోమశిల మునక ప్రాంతం కిందికి తీసుకుని నష్టపరిహారం చెల్లించాలని ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లె పెన్నపేరూరు గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌కు విన్నవించారు. 2009లో తమ గ్రామాలకు సంబంధించిన భూములు సోమశిలలో మునకకు గురయ్యాయని, దీంతో జీవనాధారం కోల్పోయామన్నారు. కావున గ్రామ స్థలాలను భూసేకరణ కిందికు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టరుకు విన్నవించారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ మంత్రి రామానాయుడి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వివరించారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

వేంపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు ఏఎస్‌డబ్ల్యూఓ రామాంజనేయులు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన వీటిని విద్యార్థులకు సోమవారం అందించారు. విజిలెన్స్ మానిటరిగ్ కమిటీ సభ్యులు నాగన్న హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి విద్యావంతులు కావాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌డబ్ల్యూఓ మాణిక్యరావు పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



నేనెవరినో చెప్పుకోండి చూద్దాం.. చిట్టడవిలా కనిపిస్తాను.. కానీ అడవిని కాను.. పంట సాగుకు పనికిరాక వదిలేసిన పొలంలా కనిపిస్తాను.. కానీ భూమిని కాను.. నేనింకెవరిని అంటారా..! అదేనండీ.. నన్ను బుగ్గవంక అని పిలుస్తారు.. పాలకులు.. అధికారులు మారినప్పుడల్లా నన్ను ఏదేదో చేసేస్తాం అంటుంటారు. అంతా తుస్సే.. ఒకప్పుడు 'బుగ్గవంక సుందరీకరణ' అన్నారు. ఇదేనా సుందరీకరణ అంటే... -స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాలి

వల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మన వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పురావస్తు విభాగ అధిపతి ప్రొఫెసర్ పి.భాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా ఎస్వీ యూనివర్సిటీకి చెందిన ప్రాచీన భారతదేశ చరిత్ర సంస్కృతి, పురావస్తు విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పుష్పగిరి, ఒంటిమిట్ట కట్టడాలను సోమవారం సందర్శించారు.

హర.. హర మహాదేవ శంభోశంకర



కడప నగరం మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు... అలంకారంలో స్వామివారు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

కడప కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చివరి సోమవారం జిల్లాలో గల శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అత్యంత నియమనిష్ఠతో ఆలయాలకు చేరుకున్నారు. కార్తీక దీపాల వెలుగులో ఆలయాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. కడప నగర మృత్యుంజయకుంటలో గల మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో పరమశివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అలాగే నబీకోట శివాలయం, దేవుని కడప శివాలయం, మోచంపేట శివాలయం, గడ్డిబజార్‌లో వెలసిన బాలాజీ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

పొలతల మల్లేశ్వర ఆలయంలో...

పెండ్లిమర్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్షేత్రమైన పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్, టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కోనమల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

లింగాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామ సమీపంలో ఉన్న కోనమల్లేశ్వర ఆయలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఐ మధుసూదన్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుష్పగిరికి పోటెత్తిన భక్తులు

వల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా పవిత్ర పినాకినీ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గౌరీమాతను మట్టితో తయారు చేసి ఆరాధించారు. అనంతరం నదిలో దీపాలను వదిలారు. కొండపైన గల రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ, సంతాన మల్లేశ్వరులను దర్శించుకున్నారు.

మహిమాన్వితం... సంగమేశ్వరం

వీరపునాయునిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిమాన్వితం సంగమేశ్వరుడి క్షేత్రం అని ఏపీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన సంగమేశ్వరుడిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగమేశ్వర దేవస్థానం అతి ప్రాచీనమైనదన్నారు. ఇక్కడ అగస్త్యమహాముని లింగ ప్రతిష్ఠ చేశాడని ప్రతీతి అన్నారు.

భైరవేశ్వర స్వామి సేవలో ఎమ్మెల్సీ

వేముల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొండ్రెడ్డిపల్లెలో వెలసిన మోపూరి భైరవేశ్వర స్వామిని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భైరవేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

కన్నులపండువగా కల్యాణం

చెన్నూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పెన్నాతీరంలో వెలసిన దాక్షాయణి సమేత మల్లేశ్వరుని కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. సాయంత్రం శివపార్వతుల గ్రామోత్సవం జరిగింది. కోలాటం, బాణసంచాతో వీధివీధినా ఊరేగిన శివపార్వతులను భక్తులు దర్శించుకున్నారు. అలాగే మధ్యాహ్నం గలిచర్ల సాంబరాజు, లక్ష్మీదేవి కుటుంబీకులు అన్న ప్రసాద వితరణ చేశారు.

కాశీవిశ్వేశ్వరుని గ్రామోత్సవం

శివాలపల్లె కాశీవిశ్వేశ్వరుని గ్రామోత్సవం ఘనంగా జరిగింది. సాసవల చిన్నమ్మ కథను వినిపించారు. రాత్రికి కోలాటం, చెక్కభజనల మధ్య గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అలాగే ఉప్పరపల్లె నాగలింగేశ్వరాలయం, చెన్నూరు లలితాంబికా నాగేశ్వరాలయం, రామనపల్లె గౌరీమల్లేశ్వర ఆలయంలో పూజలు చేశారు. కైలాసగిరికోనలో సిద్దలింగేశ్వరస్వామి ఆలయం వద్ద వనభోజనాలు చేశారు.


కడప నగరం మోచంపేట ఆలయంలో కొలువుదీరిన శివుడు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కమలాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. చదిపిరాళ్ల గ్రామంలో అగస్త్యేశ్వరస్వామి శివాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఆలయ పూజారులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు.


కడప నగరం మృత్యుంజయకుంట శివాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే






చెన్నూరు మల్లేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం...పెండ్లిమర్రి: పొలతలలో స్వామివారి ఊరేగింపు...లింగాల:అలంకరణలో కోనమల్లేశ్వరుడు.. వల్లూరు: పుష్పగిరిలో పూజలు... వేంపల్లె గవిమల్లేశ్వరాలయం వద్ద అన్నదానంలో భక్తజనం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సర ఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శివదినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ బాలుర హై స్కూల్, ఎస్సీ కాలనీ, టీటీడీ కల్యాణ మండపం, చైతన్యస్కూల్, కాపువీధి, మెయిన్ బజార్, పంచాయతీ ఆఫీస్, బిడాలమిట్టలో ఈ అంతరాయం ఉంటుందన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి అన్నారు. మండలంలోని కొండపేటకు చెందిన టీడీపీ సీనియర్ నేత ఉండేల సుధాకర్ రెడ్డి ఇటీవల ప్రమాదానికి గురై ఆపరేషన్ చేయించుకోగా అతనికి సీఎం సహాయనిధి మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. సోమవారం ఆ మొత్తాన్ని సుధాకర్‌రెడ్డికి చెక్కు రూపంలో ఎమ్మెల్యే అందజేశారు. మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, సి.బాషు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సుధాకర్ రెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, పెద్దక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మె విరమణ

కడప(వినాయకనగర్), నవంబరు25(ఆంధ్రజ్యోతి):ప్రజలకు అత్యవసర సేవల్లో ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో తాము సమ్మెను విరమిస్తున్న ట్లు అసోసియేషన్ నాయకులు రవీంద్రానాయక్, సుబ్బయ్య తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన సమ్మెలో పాల్గొంటామని ఇదివరకు కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు నోటీసులు ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆ సమ్మెను విరమిస్తున్నామని, కావున తమకు సమానమైన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెండ్లిమర్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవాహన కలగి ఉండాలని లీగల్‌కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ పి.ఆర్ సునీతరాజు తెలిపారు. సోమవారం పెండ్లిమర్రిలోని జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఆదేశాలతో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, అంతర్జాతీయ దత్తత మాస కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థినులకు బాలల న్యాయ చట్టం, పోక్సో చట్టం, చైల్డ్ లేబర్ యాక్ట్, ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్‌తో పాటు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సామాజిక కార్యకర్త లక్ష్మీప్రసన్న మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్‌లైన్, దత్తత ప్రక్రియ ఉరించి శిశుగృహ మేనేజర్ కుమారి, పద్మిని, అశ్వినితో పాటు కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా అయ్యప్ప గ్రామోత్సవం


చిన్నమాచుపల్లెలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

చెన్నూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమాచుపల్లెలో హరిహరసుతుడు కరిములవాసుడైన అయ్యప్పస్వామి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. ఏటా నవంబరు మాసం 25న అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ గ్రామోత్సవం నిర్వహించారు. యువతులు, బాలికలు జ్యోతులు చేతబూనగా, ప్రధాన కలశాలను గురుస్వాములు తలపై ఉంచుకుని శరణుఘోష పలికారు. అలాగే చెక్కభజన అలరించింది.

రైతులు ప్రీమియం చెల్లించాలి

వీరపునాయునిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని పొందేందుకు రైతులు ప్రీమియ చెల్లించాలని ఏఓ శ్యామ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం వీరపునాయునిపల్లెలో ఆయన మాట్లాడుతూ ఎకరం ప్రకారం శనగకు రూ.480, మినుముకు రూ.285, పెసరకు రూ.270, నువ్వులు రూ.180, వేరుశనగకు రూ.480, జొన్న రూ.315, పొద్దుతిరుగుడు రూ.300, వరి రూ.630 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. వరికి డిసెంబరు 31లోపు, మిగిలిన పంటలకు డిసెంబరు 15లోపు చెల్లించాలని సూచించారు.

తల్లిదండ్రులూ.. బాధ్యత తీసుకోండి: ఆర్జేడీ


మాట్లాడుతున్న ఆర్జేడీ రవి

వేంపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల చదువును పూర్తిగా అధ్యాపకులకే వదిలేయకుండా తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని కళాశాలల ఆర్జేడీ రవి తెలిపారు. సోమవారం వేంపల్లెలోని ఉర్దూ షైనారీ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. చదువుకునే సమయంలో టీవీలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్‌నాయక్, ఫైరోజ్, షఫి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ



మంత్రి నారాలోకేశ్‌కు సమస్యను వివరిస్తున్న జడ్పీటీసీ

బద్వేలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్‌ను సోమ వారం విజయవాడలోని ఆయన చాంబర్‌లో బద్వేలుకు చెందిన మాజీ జడ్పీటీసీ బీరం శిరీషారెడ్డి, టీడీపీ మాజీ మండ లాధ్యక్షుడు జయరామిరెడ్డి కలిసి నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. బద్వేలు మం డలం నగిలేరు ఆయకట్టు కింద పుట్టా యపల్లె , గొడుగునూరు రాజుపాళెం రైతుల పంట పొలాలు ముంపునకు గురయ్యాయని వారికి నష్టపరిహారం అధికారులు చెల్లించలేదని దీనిపై దృష్టిసారించి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయ చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి) : భారతీయ సంస్కృతిని పరిరక్షి స్తున్నది దేవాలయాలే అని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు రచించిన అగస్త్యేశ్వర స్వామి ఆలయ చరిత్ర పుస్తకావిష్కరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ప్రముఖ అవధాన రచయిత నరాలరామారెడ్డి అధ్యక్షత వహించగా పుస్తకాన్ని ప్రముఖ పాత్రికేయుడు మహమూద్ సమీక్షించారు. కార్యక్రమంలో కథారచయిత చదువుల బాబు, కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ,ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి,పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి వంకదార వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శైవ ఆలయాలకు కార్తీక శోభ



మైదుకూరు... ముక్కొండకు తరలివచ్చిన భక్తులు



బద్వేలు... భక్తులకు దర్శనమిస్తున్న ఓంకారేశ్వరస్వామి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా దేవా లయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. ఆల య ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. శి వాలయంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివ లింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవా రికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంక రించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్త మిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు. రామేశ్వరంలోని ముక్తిరా మలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాములు ప్రతి ష్ఠించిన సైకత లింగం, రాజరాజేశ్వరిదేవి అమ్మవా రు, శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూల మాలలతో అలంకరించారు. హనుమత్ లింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి స్వయం గా అభిషేకాలు చేశారు. అమృతేశ్వరస్వామి ఆల యంలో మరకత లింగం, నవరత్న లింగం, జలలిం గం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు పూజలు నిర్వహించారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థం, బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వర స్వామి ఆలయాల వద్ద కార్తీకమాసం 4వ సోమవా రం భక్తులు క్యూ కట్టారు. ఆలయాల ఎదుట మ హిళలు దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణం లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించా రు. అలాగే మండలంలోని గండికోట కొట్టాలపల్లి గ్రామ శివార్లలో గండికోట మర్రికోన గురప్పస్వా మి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఉద యం నుంచి 10.30 గంటల వరకు పూజా కార్యక్ర మాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. అలాగే జమ్మలమడుగులోని కన్నెలూరు, దేవగుడి, మోరగుడి పట్టణంలో జంబులింగేశ్వర స్వామి, తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.

బద్వేలుటౌన్..: పట్టణంలోని పలుశివాలయాల్లో సోమవారం శివనామస్మరనలతో ఆలయాలు మారు మ్రోగాయి. స్థానిక రూపరాంపేట శివానందస్వామి ఆలయం, తెలుగుగంగకాలనీలోని ఓంకారేశ్వరస్వామి ఆలయం, అనంతగిరిక్షేత్రంలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకా లు నిర్వహించి భక్తులకు అన్నదానంనిర్వహించారు.

మైదుకూరు రూరల్..: కార్తీక మాసం సందర్భంగా భక్తులు తండోపతండాలుగా విచ్చేసి ఆ మల్లేశ్వరు డిని దర్శనం చేసుకొన్నారు. మైదుకూరు మున్సిపాలి టీ పరిధిలోని ముక్కండ పైకి నడిచి వెళ్లేందుకు వీలుగా చిన్నయ్యగారిపల్లె యువకులు, పలువురి దాతల ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన మెట్లు ఏర్పాటు చేశారు.మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం భారీగా ఏర్పాటు చేశారు.

ఆలయాలు సందర్శించిన ఎమ్మెల్యే..: కార్తీకమాసం లో చివరి సోమవారం కావడంతో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మైదుకూరులోని ఆలయాలను సందర్శించారు.మైదుకూరులో ముక్కంటి మల్లేశ్వరుడు, నల్లగుండ్ల స్వామి ఆలయం,అనంతరం తిరుమనాథస్వామి ఆలయం సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు,పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య, నేట్లపల్లి మల్లికార్జున్ యాదవ్,మిల్లు శ్రీను,పొలిమేర శివశంకర్‌రెడ్డి,కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: వీరబ్రహ్మేంద్రస్వామిని కార్తీక మాసం నాలుగో వారం సందర్భంగా దూరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో శివాలయాన్ని దర్శిం చారు. చివరి వారం కావడంతో ఆలయ ప్రాంగ ణంలో భక్తులు సందడి ఎక్కువైంది. సాయంత్రం 6 నుంచి మహిళలు దీపాలు వెలిగించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం భోజన వసతి, తాగునీటిని కల్పించారు.

చాపాడు..: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు సోమ వారంతో ముగిశాయి.కాగా సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, టీడీపీ నాయకు లు వెంకటేశ్వరరెడ్డి, గురివిరెడ్డి, మేకల బాబు, గోసు ల క్రిష్టారెడ్డి, వీరనారాయణ, అన్నవరం సుధాకర్‌రె డ్డి, పెరుగు నారాయణ దర్శనం చేసుకున్నారు.

ఎర్రగుంట్ల..: కార్తీక మాసం చివరి సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. రాత్రి ఉమా మహేశ్వరాలయంలో మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. పోట్లదుర్తిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో సాయంత్రం కుంకుమార్చన నిర్వహి ంచారు. శివాలయం, ఎర్రగుంట్ల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రగుంట్ల మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శివునికి అమ్మవారికి పూజ,కుంకుమార్చన నిర్వహించారు.

ఖాజీపేట..: కార్తీక సోమవారం సందర్భంగా నాగ నాథేశ్వరుని కోనకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చా రు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి పుట్టా సుధాకర్‌యాద వ్, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వ హించారు. కొండ కింది భాగంలో బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అలాగే అన్నదాన కార్య క్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం గెలుపొంది న ఎద్దులకు ఆలయ కమిటీ ఛైర్మన్ ఆదినారాయణ రెడ్డి నగదును అందజేశారు.





జమ్మలమడుగు... కన్యతీర్థంలో భక్తుల సందడి, ఎర్రగుంట్ల ఉమామహేశ్వరాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు, ఖాజీపేట... బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

హోటల్‌లో వంట గ్యాస్ సిలిండర్ల పట్టివేత

ప్రొద్దుటూరు , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డొమెస్టిక్ సిలిం డర్లు అక్రమంగా హోటళ్లలో వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని విజిలెన్సు డీఎస్పీ బాబు హెచ్చరించారు. సోమ వారం పట్టణంలోని మయూర హోటల్లో విజిలెన్సు అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్, సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సం యుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 వంటగ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. హోటల్ యజమానిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సివిల్‌సప్లయ్ డీటీ మల్లికార్జున, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాథ్ రెడ్డి,ఎంఎల్‌ఆర్‌ఐ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొండాపురం మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

సమాజంలో ఆదర్శంగా ఉండాలి: ఎమ్మెల్యే

రాజుపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అందరూ మంచితనం, ఆధ్యాత్మికంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం పర్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్తీక మాసం వన భోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సహదేవరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'కోటపేరుతో గేటు వసూళ్లు చేయడం దారుణం'

జమ్మలమడుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోటకు ముందుభాగాన కోట పేరు చెప్పి టోల్ గేటు వ సూళ్లు చేయడం దారుణమని సోమవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వ ర్యంలో కలెక్టరేట్ గ్రీవెన్‌సెల్‌లో డీఆర్‌వో విశ్వేశ్వర్‌నాయుడుకు జిల్లా కార్యదర్శి శివకుమార్ వినతి పత్రం అందజేసినట్లు తెలి పారు. ఆయన జమ్మలమడుగులో సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ పర్యాటక కేంద్రమైన గండికోటలో ఎ లాంటి సౌకర్యాలు లేకుండానే టోల్‌గేటు ద్వారా గండికోట ఎం ట్రీ ఫీజు వసూళ్లు చేస్తున్నారన్నారు. గండికోటకు వచ్చిన వా రంతా అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు.

మృతదేహాలకు నివాళులర్పించిన విజయమ్మ



నివాళులర్పిస్తున్న విజయమ్మ

కాశినాయన, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ముదిరెడ్డిపల్లె సమీపంలోని ఎద్దోడుకనం వద్ద ఆదివారం జరిగిన రోడు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోవడం దారుణమని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో శవపరీక్షల అనంతరం సోమవారం చిన్నాయపల్లె గ్రామానికి తీసుకొచ్చిన గుర్రాల శ్రీనివాసులరెడ్డి అతని భార్య అరుణ కూతురు పవిత్ర మృతదేహాలను ఆమె సందర్శించి నివాళులర్పించారు.జిల్లా టీడీ పీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,నేతలు బసిరెడ్డి రవీంద్రా రెడ్డి,ఓ.రోహిత్‌రెడ్డి,వడ్డమాను విజయ్‌కుమార్ రెడ్డి, దుగ్గిరెడ్డి, పంగా రవీంద్రారెడ్డి, డి.క్రిష్ణారెడ్డి,పాశం బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా మునెయ్యస్వామి తిరుణాళ్ల



మునెయ్యస్వామి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని మునెయ్యస్వామి ఆలయంలో తిరుణాళ్ల ఘ నంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం నాడు మునెయ్య స్వామి సజీవ సమాధి కావడంతో తి రుణాళ్లను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వామికి కోళ్లు, మేకలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోనే వంటలు వండుకుని భోజనాలు చేశారు. కొం దరు భక్తులు తమ పిల్లల పుట్టి వెంట్రుకలు సమర్పించారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులకు ఇ బ్బంది లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా జ్యోతి మహోత్సవం



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను పట్టణంలో వైభవంగా నిర్వ హించారు. ఆదివారం అర్ధరా త్రి ప్రారంభమైన ఈ ఉత్సవా లు సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి. భక్తులు చౌ డేశ్వరీదేవి జ్యోతిని తలపై ఉంచుకుని ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. కొంద రు భక్తులు కోళ్లను బలి ఇచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తు లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు.

సాగునీటి సంఘాలపై అధికారులకు శిక్షణ

ఎర్రగుంట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నీటి వినియోగ దారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులకు సోమవారం ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల విధి విధానలపై అధికారులు సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీవో వెంకటరమణయ్య, నీటి పారుదల సహాయక ఇంజినీర్లు రేష్మ, జాన్సన్, రాజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు పర్యవేక్షించిన కమిషనర్

ప్రొద్దుటూరు , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు ఎప్పటి కప్పుడు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వార్డుల్లో పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో వుండాలని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. సోమవారం రెండో డివిజన్ పరిధిలో పారిశుధ్య చర్యలను కమిషనర్ మల్లికార్జున పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీత, మేస్త్రీలు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైభవంగా వనభోజనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

గోపవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :బద్వేలు - నెల్లూరు జాతీయ రహదారి పక్కన వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద అంగరంగ వైభవంగా వన భోజనాలు నిర్వహించారు. గోపవరం పంచాయతీ ప్రజలు పెద్ద ఎత్తున బోనాలతో వచ్చి పొంగళ్లు చేసుకుని స్వామివారి మొక్కు తీర్చుకున్నారు. కార్తీక మాసం నాలుగో వారంలో ప్రతి యేటా గోపవరం పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు, చుట్టు పక్కల గ్రామస్థులు స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం భక్తులకు అన్నదానం, ఎద్దులకు బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా గళం విప్పాలి

ఎర్రగుంట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హింసకు తావులేకుండా ఇకపై మహిళాశక్తి గళం విప్పాలని వెలుగు పీడీ ఆనందనాయక్ పేర్కొన్నారు. సోమవారం జెండర్ క్యాంపెయిన్ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఎర్రగుంట్ల వెలుగు భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమానికి ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు హాజరై కేంద్ర మంత్రి ప్రసంగాన్ని, కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా పోట్లదుర్తిలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీసీలు, వీఓఏలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ఖాజీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట కర్నూలు-కడప జాతీయ రహదారి పూసల కొట్టాల సమీపంలోని అయ్యప్పస్వామి అష్టమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించా రు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం భారీ గా ఏర్పాటుచేశారు.కాగా ఎమ్మెల్యే పుట్టా సు ధాకర్‌యాదవ్, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రా రెడ్డి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. అయ్యప్పస్వామి గ్రామోత్సవం కోలా టం, కేరళవారిచే డప్పు వాయిద్యాలు మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠం మండలంలోని చెంచయ్యగారిపల్లె గ్రామంలో అయ్యప్పస్వామి పూజ ఏర్పాటు చేసిన అనం తరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో అయ్యప్పస్వామికి అధిక సంఖ్యలో మహిళలు స్వాగతం పలికి కాయ కర్పూరం సమర్పించారు. అలాగే భక్తి పాటలు, కోలాటం భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





ఖాజీపేట... కోలాటం చేస్తున్న మహిళలు, బ్రహ్మంగారిమఠం... గ్రామోత్సవంలో అయ్యప్పస్వామికి స్వాగతం పలుకుతున్న మహిళలు